క్లుప్తంగా

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్

నెల్లూరు రూరల్: వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే రేషన్ బియ్యాన్ని డీలర్లు అందిస్తారని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 89 వేల మంది వృద్ధులు, దివ్యాంగుల కార్డులను గుర్తించామని, వీటిని మండలాల వారీగా విభజించి డీలర్లకు సమాచారాన్ని అందించనున్నామని వివరించారు. మూడు రోజుల్లో సుమారు 50 వేల మంది వృద్ధులకు బియ్యాన్ని పంపిణీ చేశామని వెల్లడించారు. డీలర్లు తప్పనిసరిగా వారి ఇంటికెళ్లి రేషన్ ఇవ్వాలని, అలా చేయలేదనే ఆరోపణలొస్తే చర్యలు చేపడతామని హెచ్చరించారు.

ఎగసిపడిన మంటలు

నెల్లూరు(క్రైమ్): పెన్నా బ్యారేజీ సమీపంలోని నదిలో పెద్ద ఎత్తున మంటలు మంగళవారం రాత్రి చెలరేగాయి. నదిలోని చెత్తాచెదారాలు, గడ్డికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడం వల్లో.. లేదా మరే ఇతర కారణంగానో ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఏడాది పాలనంతా అవినీతి, అక్రమాలే


మాట్లాడుతున్న చలపతిరావు

కోవూరు: కూటమి ప్రభుత్వ ఏడాది పాలన అవినీతి, అక్రమాలతో పూర్తయిందని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతి విమర్శించారు. నెల్లూరులోని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ అంటూ హామీలిచ్చి వాటిని విస్మరించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో తమకు అన్యాయం జరిగిందని మహిళలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వీటిని ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే తగిన గుణపాఠం చెప్తారన్నారు. పార్టీ కోవూరు మండల కన్వీనర్ అనూప్‌రెడ్డి, బాలశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

దేశ నాయకుల చరిత్రను తెలుసుకోవాలి



కొడవలూరు: దేశ నాయకుల చరిత్రను తెలుసుకోవడం ద్వారా విద్యార్థుల్లో మంచి నడవడిక ఏర్పడుతుందని ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మండలంలోని యల్లాయపాళెం గ్రంథాలయంలో దేశ నాయకుల చరిత్ర, దేశానికి వారందించిన సేవలను మంగళవారం వివరించారు. తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజేసి, తెలుగును బాగా రాయడంపై శిక్షణ ఇచ్చారు. లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన అవసరం


మాట్లాడుతున్న విజయన్

కొడవలూరు: సోలార్ విద్యుత్‌పై అవగాహన అవసరమని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ సూచించారు. సోలార్ విద్యుత్‌పై మండలంలోని వెంకన్నపురంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు రాయితీని ఇస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోవూరు ఈఈ రమేష్ చౌదరి, డీఈఈ తలారి వెంకటేశ్వర్లు, ఏఈ రాములు, ఎస్పీఐ ప్రతినిధి అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వం - సాధికారతపై అవగాహన

కొడవలూరు: నాయకత్వం – సాధికారత అనే అంశంపై మండలంలోని మిక్కిలింపేటలో కిశోర బాలికలు, తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్త కామేశ్వరి, హెల్పర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.
⇒ మండలంలోని కమ్మపాళెం మజరా సంజీవనగర్‌లో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగభూషణమ్మ, హర్షవర్ధిని, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ వ్యవస్థపై ఆకస్మిక తనిఖీలు

• ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్


మాట్లాడుతున్న కార్తీక్

నెల్లూరు రూరల్: వెట్టిచాకిరీ వ్యవస్థలో కార్మికులను గుర్తించి విముక్తులను చేసేందుకు గానూ ఆకస్మిక తనిఖీలను చేపట్టాలని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ ఆదేశించారు. వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలన కోసం ఏర్పడిన జిల్లా విజిలెన్స్ కమిటీ తొలి సమావేశాన్ని కలెక్టరేట్లోని శంకరన్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటుక బట్టీలు, పరిశ్రమలు, దుకాణాలు, రొయ్యలు, చేపల గుంతలు, రైస్ మిల్లులు తదితరాల్లో కమిటీ సభ్యులు ఆకస్మిక తనిఖీలు జరిపి వెట్టి చాకిరీ బాధితులను గుర్తించాలని సూచించారు. వీరికి పునరావాసం కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని చెప్పారు. తొలుత పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సాంఘిక సంక్షేమ శాఖ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ప్రతినిధులు గంటా ప్రియాంక, శ్యామ్ వివరించారు. సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి, కార్మిక శాఖ ఉప కమిషనర్ వెంకటేశ్వర్లు, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కృష్ణారెడ్డి, ఏఎస్సై శ్రీహరి, కమిటీ సభ్యులు బషీర్, సుదర్శన్, శ్వేత, సత్యవతమ్మ, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

• సమగ్ర జనాభా నిర్వహణ విధానంపై ప్రజాభిప్రాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం సేకరిస్తోందని, ఇందులో ప్రజలు భాగస్వాములు కావాలని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ ఒక ప్రకటనలో కోరారు. క్యూఆర్ కోడ్ టెక్నాలజీతో కూడిన మొబైల్ యాప్ ద్వారా అభిప్రాయాలను తెలియజేయాలని సూచించారు. పర్యవేక్షణకు గానూ ప్రతి మండలం, మున్సిపాల్టీకి ఒక సీనియర్ అధికారిని నియమించనున్నామని వెల్లడించారు. జిల్లా స్థాయిలో గ్రామ, వార్డు సభల నిర్వహణకు వివిధ విభాగాలు బాధ్యత వహించనున్నాయని పేర్కొన్నారు.

మందులను అందుబాటులో ఉంచాలి


మాట్లాడుతున్న ఐద్వా నేతలు

నెల్లూరు(అర్బన్): నగరంలోని జీజీహెచ్‌లో రోగులకు అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని ఐద్వా రూరల్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వరలక్ష్మి, షాహినాబేగం డిమాండ్ చేశారు. జీజీహెచ్‌లోని ప్రసూతి, చిన్నపిల్లలు, గైనకాలజీ విభాగాలను మంగళవారం వారు పరిశీలించారు. వైద్యసేవలు, ఆహారం, పారిశుద్ధ్యం తదితరాలపై రోగులతో మాట్లాడారు. కొన్ని రకాల మందులు ఇక్కడ లేవని, బయట కొనుగోలు చేయాలంటూ చీటీలను డాక్టర్లు రాసిస్తున్నారని వివరించారు. ఇప్పటికైనా రోగులకు అవసరమైన అన్ని రకాల మందులను ఆస్పత్రిలో సిద్ధంగా ఉంచుకోవాలని వారు కోరారు. నేతలు అరిగెల రమమ్మ, షంషాద్, జకీరా, రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.

గుకేష్ స్ఫూర్తితో చెస్‌లో రాణించాలి



విజేతలతో నిర్వాహకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రపంచ చెస్ చాంపియన్ గుకేష్ స్ఫూర్తితో నెల్లూరు క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఎంజీబీ మాల్ ఎండీ గోపాలకృష్ణ పేర్కొన్నారు. నగరంలోని ఎంజీబీ మాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చెస్ అసోసియేషన్, ఆనంద్ వింగ్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి చెస్ శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు. మాల్ డీజీఎం మల్లికార్జునరెడ్డి ,అసిస్టెంట్ మేనేజర్ కృష్ణ, చెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమన్, ఆనంద్ వింగ్స్ అకాడమీ నిర్వాహకుడు గోపీనాథ్, కోచ్ వెంకటరమణ, జగదీష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం నేడు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలు, అరాచకాలు, అన్యాయాలను నిరసిస్తూ వెన్నుపోటు దినాన్ని బుధవారం నిర్వహించనున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని నియోజకవర్గాల్లో ఉదయం తొమ్మిది నుంచి కార్యక్రమాలను జరపనున్నారు. ర్యాలీలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలను అందజేయనున్నారు. కార్యకర్తలు, నేతలు, ప్రజలు భారీగా హాజరై తమ నిరసన గళాన్ని వినిపించాలని ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తలు కోరారు.

పాఠశాల నిర్మాణ పనుల పరిశీలన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): అక్కచెరువుపాడులో మైనార్టీ గురుకుల పాఠశాల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి మౌలిక వసతులను కల్పించాలని ఆవాజ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రఫీ, రషీద్ డిమాండ్ చేశారు. నిర్మాణంలో ఉన్న పాఠశాలను మంగళవారం పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. ఒక్క భవనంలో విద్యను నేర్పిస్తూ, అందులోనే హాస్టల్‌ను ఏర్పాటు చేయడంతో భోజన సమయంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రసూల్, నజీర్, జావీద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

బాలలతో పనిచేయిస్తే కఠిన చర్యలు


స్టోన్‌హౌస్‌పేటలో అధికారుల తనిఖీలు

నెల్లూరు (పొగతోట): హోటళ్లు, షాపింగ్ మాళ్లు, వ్యాపార సంస్థల్లో బాలలతో పనిచేయిస్తే యాజమాన్యాలపై కఠిన చర్యలు చేపడతామని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ హరిబాబు, బాలల సంరక్షణాధికారి సురేష్ స్పష్టం చేశారు. బాలల సంరక్షణలో భాగంగా స్టోన్‌హౌస్‌పేట, నవాబుపేట, రేబాలవారివీధి తదితర ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్‌ను మంగళవారం నిర్వహించారు. నలుగురు బాలలను గుర్తించి కౌన్సెలింగ్ అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బాలలను గుర్తించి పాఠశాలలకు పంపేలా చర్యలు చేపడతామని వివరించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రామారావు, సురేష్, ఏఎస్సై సతీష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో సముదాయాల్లో పర్యటన



నెల్లూరు(బారకాసు): పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా 54 / 4 సచివాలయ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల ప్రాంతంలో ఎంహెచ్‌ఓ చైతన్య మంగళవారం పర్యటించారు. ఇళ్ల బ్లాకుల మధ్య పేరుకుపోయిన చెట్లను తొలగించాలని సూచించారు. ఫాగింగ్‌ను తరచూ చేపట్టాలని చెప్పారు.

ఏమరుపాటుగా ఉంటే అంతే..


ప్రమాదభరితంగా గుంత

నెల్లూరు(బృందావనం): నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన మార్గంలో ప్రమాదం పొంచి ఉంది. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా, తగిన మూల్యం చెల్లించుకోక తప్పదనే ఆందోళన వ్యక్తమవుతోంది. నెల్లూరు నుంచి పొదలకూరు వెళ్లే ప్రధాన మార్గంలో శ్రీలంక కాలనీ ఎదురుగా, రాజీవ్ గృహకల్పకు వెళ్లే మలుపులో నీటి సరఫరా కోసం గుంతను తవ్వి సిమెంట్ బండలేసి మూసేశారు. అయితే మూడు నెలల క్రితం అదుపుతప్పిన ఓ లారీ రావడంతో బండలు పగిలిపోయాయి. నాటి నుంచి నేటి వరకూ ఎవరూ పట్టించుకోలేదు. దీంతో కర్రను గుంతలో పాతి, టైర్‌ను పెట్టి అప్రమత్తం చేశారు. గుంతను పూడ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మెరుగైన పరిహారమివ్వాలని డిమాండ్


మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు మెరుగైన నష్టపరిహారాన్ని చెల్లించాకే పనులను చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి పుల్లయ్య, రైతు సంఘ జిల్లా కార్యదర్శి వెంగయ్య డిమాండ్ చేశారు. నగరంలోని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మంగళవారం వారు మాట్లాడారు. జాతీయ రహదారి 67లో 108 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం ఆరు మండలాల్లోని 38 గ్రామాల్లో 980 ఎకరాలను సేకరించారని చెప్పారు. అయితే నామమాత్రపు పరిహారాన్నే ఇస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా 2013 భూ సేకరణ చట్టం మేరకు నష్టపరిహారాన్ని చెల్లించి పునరావాసాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి గోపాల్, నేతలు గురునాథం, వెంకమరాజు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా పేరు మార్పుపై హర్షం



నెల్లూరు(అర్బన్): హెల్త్ ఎడ్యుకేటర్ పోస్ట్ హోదాను డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా మార్పు చేస్తూ జీఓను ప్రభుత్వం జారీ చేయడంపై హెల్త్ ఎడ్యుకేటర్స్ సర్వీసెస్, వెల్ఫేర్ అసోసియేషన్, అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీలు వెంకటరమణ, చేజర్ల సుధాకర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. సంతపేటలో విలేకరులతో మంగళవారం వారు మాట్లాడారు. తమ అభ్యర్థన మేరకు పేరు మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. దీనికి సహకరించిన సీఎం చంద్రబాబు తదితరులకు కృతజ్ఞతలను తెలియజేశారు. అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి హరిప్రసాద్, అసోసియేట్ ప్రెసిడెంట్ జయప్రకాష్, నిర్వహణ కార్యదర్శి సయ్యద్ బేగం, సెక్రటరీ సరోజినీదేవి, జాయింట్ సెక్రటరీ అనూరాధ, కార్యవర్గ సభ్యులు వరప్రసాద్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య వివాదం

నెల్లూరు(క్రైమ్): ఇరువర్గాల నడుమ వివాదం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు...సరస్వతీనగర్‌లో శిరీషా, లక్ష్మీరెడ్డి కుటుంబాలు ఎదురెదురు ఇళ్లలో నివాసం ఉంటున్నాయి. చిన్నపాటి విషయాలపై వీరి నడుమ కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శిరీష భర్త సుధాకర్‌పై ఓ కేఫ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం దాడి చేశారు. ఘటన వెనుక లక్ష్మీరెడ్డి ప్రమేయం ఉండొచ్చనే అనుమానంతో శిరీష కుమారుడు శ్రీను ఆమె ఇంటి వద్దకెళ్లారు.
పార్క్ చేసి ఉన్న ఆమె కారు అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో ఆగ్రహించిన లక్ష్మీరెడ్డికి చెందిన వారు శిరీష ఇంటి ముందు ఉన్న పూలకుండీలను ధ్వంసం చేశారు. ఈ మేరకు బాలాజీనగర్ పోలీసులకు ఇరువర్గాలు ఫిర్యాదు చేశారు. విచారణ జరుపుతున్నామని ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు తెలిపారు.

సనాతన ధర్మాన్ని అపహాస్యం చేయడం తగదు

నెల్లూరు రూరల్: సనాతన ధర్మంపై సీపీఐ నేత నారాయణ వ్యాఖ్యలను బీజేపీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. వ్యక్తిగత జీవితాన్ని ఆధారంగా తీసుకొని ధర్మాన్ని విమర్శించడం బాధాకరమని పేర్కొన్నారు.

‘కోవిడ్ నేపథ్యంలో సామూహిక యోగా వద్దు’

నెల్లూరు(అర్బన్): కోవిడ్ వ్యాపిస్తున్న నేపథ్యంలో విశాఖపట్నంలో ఈ నెల 21న నిర్వహించనున్న భారీ యోగా దినోత్సవాన్ని రద్దు చేయాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్య, కామేశ్వరరావు డిమాండ్ చేశారు. కోవిడ్ వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలంటూ సీఎంకు వినతిపత్రాన్ని మంగళవారం పంపారు.

పేగు వ్యాధులకు అధునాతన చికిత్సలు

నెల్లూరు(అర్బన్): పేగు సంబంధిత వ్యాధులను నివారించేందుకు గానూ మెడికవర్ స్పెషాల్టీ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్యచికిత్సలను అందిస్తున్నామని హాస్పిటల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రోనస్, అల్సరేటివ్ కొలైటిస్ లాంటి వ్యాధులకు చక్కటి వైద్యసేవలను అందిస్తున్నామని వివరించారు.

సమస్యల పరిష్కారానికి వినతి

నెల్లూరు (టౌన్): ఉన్నత విద్యారంగంలో అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని అఖిల భారతీయ శైక్షిక్ మహాసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సీపీఎస్ రద్దు, ఉద్యోగ విరమణ పొందిన అధ్యాపకులకు రావాల్సిన బకాయిల విడుదల తదితరాల్లో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, కేశవ్‌కు వినతిపత్రాలను పంపామన్నారు.

పది వేల సోలార్ కనెక్షన్లే లక్ష్యం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఈ నెల్లో పది వేల సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలనే లక్ష్యంతో పని చేయాలని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్ నుంచి జిల్లా అధికారులతో మంగళవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పీఎం సూర్యఘర్ సోలార్ పథకంపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని కోరారు. బీసీలకు కేంద్ర ప్రభుత్వం రూ.78 వేలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.20 వేలను సబ్సిడీ రూపంలో ఇస్తోందని వివరించారు. సూర్యఘర్ నోడల్ అధికారి శేషాద్రి బాలచంద్ర పాల్గొన్నారు.

రేపట్నుంచి యోగా పోటీలు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో యోగా పోటీలను గురు, శుక్రవారాల్లో నిర్వహించనున్నామని కమిషనర్ నందన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వీటిని నిర్వహించనున్నమని వివరించారు. ఎంపికైన వారు మండల స్థాయిలో జరిగే పోటీలకు.. అక్కడ ప్రతిభ చూపిన వారు జిల్లా స్థాయికి ఎంపిక కానున్నారని వివరించారు. వివరాలకు 94416 85593, 63012 71792 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సురక్షితంగా పనిచేసేలా చర్యలు




మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్

నెల్లూరు రూరల్: నెల్లూరులో పనిచేస్తున్న 90 మంది సఫాయి కర్మచారీలకు రిఫ్లెక్టింగ్ జాకెట్లు, సేఫ్టీ హెల్మెట్లు, ఫేస్ మాస్క్, హ్యాండ్ గ్లౌజ్‌లు, బూట్లు, రక్షణ దుస్తులు తదితరాలను అందజేసి సురక్షితంగా విధులు నిర్వర్తించేలా చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు. మాన్యువల్ స్కావెంజర్స్ యాక్ట్‌పై జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్లో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. తొలుత నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న వారి భద్రత కోసం చేపడుతున్న చర్యలను మున్సిపల్ ఈఈ శ్రీనివాస్ వివరించారు.
సఫాయి కర్మచారీల సమస్యలను కమిటీ సభ్యులు చిన్నారావు, పెంచలయ్య, లావణ్య, మురళి ప్రస్తావించారు. అనంతరం కార్తీక్ మాట్లాడారు. అర్హులను గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశించారు. మెడికల్ క్యాంపులను మూడు నెలలకోసారి నిర్వహించాలని సూచించారు. కార్పొరేషన్ నుంచి పెండింగ్ బిల్లులను చెల్లించాలని తెలిపారు. వివిధ శాఖల అధికారులు శ్రీధర్‌రెడ్డి, శోభారాణి, అశోక్‌కుమార్, వెంకటరమణ, చైతన్య, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో బాలుడి భవిష్యత్తు


చికిత్స పొందుతున్న అవినాష్


ఇంటిపై 11 కేవీ వైర్లు

• విద్యుదాఘాతంతో కుడి చేతిని కోల్పోయిన వైనం
• బాబాయ్ ఇంటికొచ్చి.. ప్రమాదానికి గురై

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో బాలుడి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. 11 కేవీ తీగలు తగిలి తీవ్రంగా గాయపడి.. చివరికి కుడి చేతిని కోల్పోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. నెల్లూరు రూరల్ పరిధిలోని పెద్దచెరుకూరు శివాలయ ప్రాంతంలో పేర్నేటి కార్తీక్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో వేసవి సెలవుల నేపథ్యంలో హైదరాబాద్‌లో ఉంటున్న తన సోదరుడి కుమారుడు అవినాష్‌కుమార్‌రెడ్డి (10) వచ్చారు. ఈ నేపథ్యంలో గత నెల 16వ తేదీ సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో ఆడుకునేందుకు మిద్దె ఎక్కే క్రమంలో 11 కేవీ తీగలు తగిలాయి. విద్యుత్ సిబ్బంది ఏర్పాటు చేసిన వీ ఆకారపు క్లాంప్ ఒరిగి ఉండటంతో తీగలు ఇంటి ప్రాంగణంలోకి వచ్చాయి. దీన్ని గమనించకపోవడంతో అవినాష్ విద్యుదాఘాతానికి గురయ్యారు. చెన్నైలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. చేతి నరాలు తీవ్రంగా కాలిపోవడంతో గత నెల 22న చికిత్స చేసిన వైద్యులు తప్పనిసరి పరిస్థితుల్లో అవినాష్ కుడిచేతిని తొలగించాల్సి వచ్చింది. ఇప్పటికే రూ.13 లక్షలు ఖర్చుకాగా, ప్లాస్టిక్ సర్జరీ, కృత్రిమ చేతికోసం మరో రూ.15 లక్షల వరకు అవుతుందని, మూడు నెలల పాటు ఆస్పత్రిలోనే చికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగిందంటూ నెల్లూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.